ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్

ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 11 డిసెంబరు , 2024 | పేజీలు :06


## ప్రజలను మోసం చేస్తున్న రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** తక్కువ రేషన్ బియ్యం (పోస్తూ) తూకం వేస్తూ ప్రజలను మోసం చేస్తున్న రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డీఎస్‌ఓకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రేషన్ బియ్యం తీసుకుందుకు వెళ్లిన వారిపై దురుసుగాప్రవర్తించగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒకపక్క బ్లాక్‌లో రేషన్ బియ్యం అమ్ముకుంటూనే మరోపక్క ఎక్కువ బరువు వచ్చేందుకు జోర సంచితో తూకం వేస్తూ గాజులపేట్‌లో చౌక ధరల దుకాణంలో ఒక్కొక్కరికి 600 నుంచి 700 గ్రాములు తగ్గించి ప్రజలను మోసం చేయడాన్ని గమనించి అడ్డుకున్నారు. మోసం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అడిగితే ఇక్కడ ఇలాగే జోకుతామని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ దురుసుగా మాట్లాడుతున్నారని ఆ రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకుని జరుగుతున్న మోసం ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

## సత్వర సేవలు, అవినీతిరహిత

# విధులు అందించాలి

* సబ్ రిజిస్ట్రార్‌ను కోరిన సిపిఐ ప్రజా సంఘాల నాయకులు

* పోరాట ఫలితమే కార్యాలయం మంజూరు, తరలింపు



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు సత్వర సేవలు అందించడంతోపాటు అధికారులు అవినీతిరహిత విధులు నిర్వర్తించాలని సీపీఐ ప్రజా సంఘాల నాయకులు కోరారు. మంగళవారం సీపీఐ అనుబంధ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్, సీపీఐ నగర కార్యవర్గసభ్యులు తొడుపునూరి రమేష్‌కుమార్, ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.ఎ.గౌస్, డీహెచ్‌పీఎస్ నగర ప్రధాన కార్యదర్శి ఎర్రల రాజయ్య, నాయకులు గంగారపు ప్రసాద్, శ్రీనివాస్‌లు రామగుండంలోని సబ్ రిజిస్ట్రార్ తిరుపతి నాయక్‌ను కలిసి పూలగుత్తి అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో ప్రజా సౌకర్యాల గురించి మాట్లాడారు. రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా సీపీఐ ప్రజా సంఘాలు చేసిన అనేక పోరాటాల వల్ల పెద్దపల్లిలో ఉన్న కార్యాలయాన్ని రామగుండానికి తరలించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం రామగుండంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భారాస ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యే, ఉన్నతాధికారులను అనేకమార్లు తాము కోరినట్లు తెలిపారు. తమ పోరాట ఫలితమే 2023 ఏప్రిల్ 1న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంజూరు చేస్తూ తాత్కాలికంగా పెద్దపల్లిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యాలయం ఏర్పడినప్పటికి గోదావరిఖని ప్రాంతం నుంచి చాలా మంది 30 కిలోమీటర్ల దూరంలోని కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదని, ఈ కార్యాలయాన్ని రామగుండానికి తరలించాలని తాము అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యేతో డిమాండ్ చేసినట్లు తెలిపారు. స్థానికంగా కార్యాలయం ఏర్పాటుతో ఇక్కడి ప్రజలు, రైతుల ఇబ్బందులు దూరం కానున్నాయన్నారు. అప్పటి ప్రభుత్వం మంజూరు చేయడం, ఇప్పటి ప్రభుత్వం కార్యాలయాన్ని తరలించి స్థానికంగా ఏర్పాటు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమన్నారు. కార్యాలయంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు, వీధి దీపాలు, కార్యాలయం బోర్డు గేటుతోపాటు రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులను కోరారు. దస్తావేజు లేఖరులుగా ఇతర ప్రాంతాల వారు వచ్చి ఇక్కడి నిరుద్యోగులకు అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక లేఖరులను ఇబ్బంది పెడ్తే ఊరుకునేది లేదన్నారు. గత అధికారులపై అనేకమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయని, తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారని, ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, అలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలని వారు కోరారు.

## నేరాలకు పాల్పడే అంతరాష్ట్ర

# దొంగ అరెస్టు

చోరీ కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

విలువైన ఆభరణాలు, వస్తువులు స్వాధీనం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** అంతరాష్ట్ర కన్నపు నేరాలకు పాల్పడే దొంగను అరెస్టు చేసిన ఘటన మంగళవారం కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. చోరీ కేసును చేదించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా అతని నుంచి 16 గ్రాముల బంగారు గొలుసు, 4 గ్రాముల ఉంగరం, సాంసంగ్ ఎల్ఈడీ టివి తో పాటు 46 గ్రాముల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన ఉప్పుగుండ్ల మురళీకృష్ణ తల్లి కరీంనగర్ కట్టరాంపూర్ శాతవాహన కాలనీలో నివాసం ఉంటోంది. గత నెల 23న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. రెండు రోజుల అనంతరం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని టివితో పాటు బీరువా పగలగొట్టబడి అందులో గల 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయని, గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించి వెంటనే కరీంనగర్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. బాదితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బిళ్ల కోటేశ్వర్ కేసు నమోదు చేసి తన సిబ్బందిని అప్రమత్తం చేసి విచారణ ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తుండగా మంగళవారం స్థానిక గౌతమినగర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఒక వ్యక్తి ఉన్నాడని, అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా, మండపేట మండలం, చెరువు గట్టు గ్రామానికి చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు (50)గా తేలిందన్నారు. అట్టి దొంగతనానికి పాల్పడ్డది తానే అని నిందితుడు ఒప్పుకోగా వెంటనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. రిమాండ్ విధించగా జైలుకు తరలించామని కరీంనగర్ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బిళ్ల కోటేశ్వర్ తెలిపారు. ఈ కేసులో నిందితుడైన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు గతంలో ఏపి, తెలంగాణలో దాదాపు 20కి పైగా కేసులు నమోదు కాబడినవని , జైలు శిక్షణ సైతం అనుభవించాడని తెలిపారు.

# రబీ 2022-23 టెండర్ ధాన్యాన్ని బిడ్డరుకు అప్పగించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** డిసెంబర్ 31లోగా రబీ 2022–23 సీజన్ కు సంబంధించి పెండింగ్ టెండర్ ధాన్యాన్ని తప్పని సరిగా బిడ్డరుకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మిల్లర్లను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి జిల్లాలోని రైస్ మిల్లర్లు, సంభందిత అధికారులతో పెండింగ్ లో ఉన్న ఆక్షన్ ధాన్యం పై సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ సీజన్ 202223 కు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో ఇప్పటి వరకు 60% ఆక్షన్ ధాన్యం లిఫ్ట్ చెయ్యడం జరిగింది, పెండింగ్ ఉన్న 40% నిర్దేశిత గడువు డిసెంబర్ 31 లోగా పూర్తి చేయాలని,జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు వారికి కేటాయించిన టెండర్ ధాన్యాన్ని వెంటనే బిడ్డరుకు అప్పగించాలని, ఆలస్యం చేస్తున్న రైస్ మిల్లులను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని, టెండర్ ప్యాడి గడువు పెంపు ఉండదని, నిర్దేశిత సమయంలోగా మిల్లుల వారీగా తమకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలోజిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తేమ వస్తే వెంటనే కొనుగోలు చేయాలి...

**- జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు**



**ప్రజాపక్షం/మంథని:** కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం మాయిశ్చర్ వస్తే వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి వేణు ఆదేశించారు. మంగళవారం మంథని మండలం గుంజపడుగు, పవర్ హౌజ్ కాలనీ, అంగళూరు. నాగారం గ్రామాలతో పాటు రామగిరి మండలంలో ఏర్పాటు చేసిన పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తేమశాతం రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని, 17శాతం తేమ రాగానే కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ఓపిఎంఎస్‌లో నమోదు చేస్తూ రైతులకు త్వరగా ధాన్యం చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరుగడానికి వీలు లేదని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున కేంద్రాల వద్ద టార్పిలిన్ కవర్లు సిద్దంగా ఉంచాలని, వర్షాలతో రైతులకు నష్టం జరుగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.



## ఉద్యోగులకు బదిలీలు సహజం

### బదిలీపై వెళ్లిన ఎంఇఒ కు సన్మానం

**ప్రజాపక్షం/తిర్యాని:** తిర్యాని మండల విద్యాశాఖ అధికారిగా పని చేసి కాసిపేట మండలానికి బదిలీపై వెళ్లిన సందర్భంగా మంగళవారం తిర్యాని మండల ఉపాధ్యాయులు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎంఇఒ వెంకటేశ్వర స్వామితో పాటు అలాగే బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి గత 5 సంవత్సరాలుగా పాఠశాలల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి, ఎంతో కృషి చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తిర్యాని, కన్నెపల్లి ఎంఇఒ,సేడమకి రాము, బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/సారంగాపూర్:**సారంగాపూర్ మండలం కేంద్రంలో రైతువేదికలో ప్రియునిక్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డీజీఎం మల్లేశ్వరరావు ఆయిల్ ఫామ్ పంట సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు.ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు ఎకరాకు 50 మొక్కలు రాయితీపై ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.ఆయిల్ ఫామ్ పంట సాగు విధానాలు ప్రతి రైతుకు అవసరమన్నారు. ఆయిల్ ఫామ్ చెట్టు యొక్క వయసు 30 సంవత్సరాలు పెంచుకోవచ్చు అన్నారు. ఆయిల్ ఫామ్ చెట్ల నుండి వచ్చే గెలల ద్వారా ఫామ్ ఆయిల్ వస్తుందని ప్రతి రైతు ఎకరానికి మూడు లక్షల వరకు దిగుబడి తీయచ్చని సూచించారు.త్వరలో ములుగు జిల్లా లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కాబోతుందని తెలిపారు.రైతులుఅడిగిన ఆయిల్ ఫామ్ పంటవిధానాలపై నివృత్తి చేశారు .ఈ కార్యక్రమంలోమండలవిస్తరణఅధికారి అరుణ్ ,క్రాప్ మేనేజ్మెంట్ ఆఫీసర్ కరుణాకర్,ఏరియా మేనేజర్ మొనోజ్,క్లస్టర్ ఆఫీస ర్‌చిన్నయ్య,కృష్ణమండలరైతులుపాల్గొన్నా రు.

## దేశ ద్రోహిని కఠినంగా శిక్షించాలి

### *మాజీ ఎంపిపి చిలుక పెంటయ్య

**ప్రజాపక్షం /చందుర్తి:**తప్పుడు పత్రాలతో భారత దేశ పౌరుడినని గత పదిహేను సంవత్సరాలుగా న్యాయ స్థానాలను తప్పు ద్రోవ పట్టిస్తూ నియోజకవర్గ ప్రజలను,రాష్ట్ర ప్రభుత్వాన్ని మోసం చేసిన దేశ ద్రోహి,వేములవాడ మాజీ ఎంఎల్‌ఏ చెన్నమనేని రమేష్ బాబు ని కఠినంగా శిక్షించాలని చందుర్తి మాజీ ఎంపిపి చిలుక పెంటయ్య అన్నారు.కార్మిక నాయకుడు చెన్నమనేని రాజేశ్వర్ రావు కి చెడ్డ పేరు తెచ్చాడని ఆవేదన చెందారు.వేములవాడ అభివృద్ధి నిరోధకుడు అయిన చెన్నమనేని రమేష్ బాబు కి జైలు శిక్ష వేసి,అతని ఆస్తులపై దర్యాప్తు చేయాలని అన్నారు.

## తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/ గొల్లపల్లి :** జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండల కేంద్రంలో మండల బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో అన్ని వర్గాలకు అనుకూలంగా ఆనాడు తెలంగాణ గుండెల్లో రూపుదిద్దుకున్న విగ్రహాన్ని మార్చి నూతనంగా కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా 4 కోట్ల తెలంగాణ ప్రజల భావాలను ధిక్కరిస్తూ విగ్రహాన్ని మార్చడాన్ని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఉద్యమ సమయంలో మేధావులు, ఉద్యమకారులు ఎందరో నివాళులర్పించిన విగ్రహం తెలంగాణ తల్లి విగ్రహం, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విగ్రహాలు మార్చడం పేర్లు మార్చడం వల్ల ఉపయోగం లేదని అన్నారు. నేడు ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కూడా గతంలో ఈ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన సందర్భాలు అనేకం ఉన్నాయని అప్పుడు లేని ఆలోచన ఇప్పుడు ఎందుకు వచ్చిందని అన్నారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు మానుకొని పాత విగ్రహాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నక్క శంకరయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, మాజీ జెడ్పిటిసి గోస్కుల జలంధర్, మాజీ సర్పంచులు నల్ల శ్యామ్, గంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వెంకట మాధవరావు, మండల అధ్యక్షులు బొల్లం రమేష్, నాయకులు భక్తుల కిషన్, కచ్చు కొమురయ్య, చెవుల రవీందర్, కలకోట సత్యం, వీర స్వామి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎరుకల కులస్తులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎరుకల కులస్తుల జాతి మొత్తం అభివృద్ధికి నోచుకోకుండా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని జిల్లా అధ్యక్షులు ఉండ్రాల ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు కెంసారం తిరుపతి ఆధ్వర్యంలో వచ్చే మంగళవారం హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే రాష్ట్ర ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని కరపత్రం విడుదల చేశారు. తెలంగాణలో ఉన్న ఎరుకల కులస్తులకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని, పందుల పెంపకందారుల కోసం ఐదు గంటల స్థలం కేటాయించాలని కోరారు. అదేవిధంగా బ్యాంకులతో సంబంధం లేకుండా ఎరుకల కులస్తులకు రూ.10 లక్షల రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాదులో జరిగే సభలో ఎరుకల కులస్తుల సమస్యలపై చర్చించి తీర్మానించడం జరుగుతుందని, కావున తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ప్రతినిధులు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలివచ్చి హైదరాబాద్ లో జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా నాయకులు, మహిళలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు..

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** భూతగాదాల నేపథ్యంలో ఒకరు హత్యకు గురికాగా, ఇట్టి కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, ఒకరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విదించినట్లు న్యాయమూర్తి నారాయణ తీర్పు ఇచ్చారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని యామాపూర్ గ్రామానికి చెందిన చెదలు రాజేందర్ అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన కాస సంజీవ్‌కు మధ్యలో భూతగాదాలు ఉన్నాయి.

13.01.2022 రోజున పొలంలో ఉన్న రాజేందర్‌ను కాస సంజీవ్, గోధూర్ గ్రామానికి చెం దిన తైదపల్లి రజనీకాంత్‌తో కలిసి కత్తితో రాజేందర్‌పై దాడి చేయగా అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని భార్య లత పిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా, కాస సంజీవ్, రజనీకాంత్, మంగళరాపు లక్ష్మి నారాయణలపై కేసు నమోదు చేశారు.

కేసు విచారించిన న్యాయమూర్తి నారాయణ మూర్తి నిందుతులైన కాస సంజీ వ్, రజనీకాంత్‌లకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి 10,000 రూ.లు జరిమానా, లక్ష్మి నారాయణకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 5000రూ.లు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

## జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి :ఎస్సై చిర్ర సతీష్



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా కేంద్రంలో గల పోలీస్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఈనెల 11న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ ఐ సతీష్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మెగా జామ్ మేళా నిర్వహించబడుతున్నందున మంగళవారం రోజు బీబిరాజుపల్లి, చిల్వకోడూరు గ్రామాలలో ఎస్ ఐ యువతీ యువకులతో మీటింగ్ ఏర్పాటు చేసి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాలో దాదాపు వివిధ రకాల 50కి పైగా కంపెనీలు జాబ్ మేళలో పాల్గొంటారని , 10వ తరగతి పాసైన యువతి యువకులతో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ,ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ చదువుకున్న యువతి యువకులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జాబ్ మేళాలో వారి యొక్క అర్హతలను బట్టి ఉద్యోగాలునాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవెల్ల సత్యనారాయణ గౌడ్, బొమ్మెన్ కుమార్, చిల్వకోడూరు యూత్ లీడర్ వెంకటేష్ గౌడ్, గ్రామాల యువతి, యువకులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులతో రవాణా సేవలు అస్తవ్యస్తం...

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలో ఇటీవల సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభమై పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. అయినప్పటికి రోడ్డు పనుల వలన ఆటోవాలాలకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పాత మట్టిని తొలగించడంతో ఆటోలను నిలిపి ఉంచడానికి ఇబ్బందిగా ఉందని, ఆయా గ్రామాలకు వెళ్ళే ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకునేందుకు తాత్కాలికంగా ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఆవరణలో నిలుపుతుండగా బస్టాండులో నిలిపితే ఆర్టీసీ అధికారులు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు ఆగ్రహించడాన్ని నిరసిస్తూ వారు మంగళవారం ధర్నా, రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌జాం కారణంగా వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోవడంతో స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. వారు మాట్లాడుతూ తాము తాత్కాలికంగా బస్టాండు ఆవరణలో ఆటోలు నిలుపుతామని, రోడ్డు పనులు పూర్తి కాగానే తిరిగి పాత స్థలంలోనే ఆటోలు నిలుపుతామని, తమను వేదింపులకు గురిచేయవద్దని వారు విన్నవించుకున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు..



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరిగాయి,వడూరు.గ్రామానికి చెందిన కళ్లెం రామకృష్ణ,టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ప్రజా పాలనలో ఎనలేని ముద్ర వేసుకున్న తీరును చూసి ఆ పార్టీ కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని ఉద్దేశంతో బిఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని పేర్కొన్నారు.ఆయన తో పాటు గ్రామ నాయకులు తదితరులు పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలంలోని కామన్ పల్లి గ్రామానికి చెందిన కామెర దుర్గయ్య అనే గల్ఫ్ కార్మికుడు అనారోగ్యం తో మృతి చెందాడు. మృతిని కుటుంబానికి కామన్‌పల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి మంగళవారం రోజున కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల వ్యవస్థాపకులు నాగరాజు, వెంకటేష్, కిరణ్, రాజన్న, రాజేష్, చిలుకలయ్య, రామన్న, దుర్గయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలను తనిఖీ చేసిన ఆర్ఐఓ

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని గురుకుల కళాశాలను జిల్లా మాధ్యమిక అధికారి చింతావార్ రవీందర్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో గల రికార్డులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల సమయం దగ్గర పడుతున్న సందర్బంగా విద్యార్థులు ప్రణాళికతో చదవాలని సూచించారు. విద్యార్థులకు పరీక్షల గురించి సూచనలు, సలహాలు తెలియజేశారు. జంబ్లింగ్ విధానంలో జరిగే పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ తనిఖీ సమయంలో కళాశాల ప్రిన్సిపల్ జి.సంగీత, ఇంటర్ సీనియర్ కెమిస్ట్రి లెక్చరర్ కె.రవి కుమార్, లత, తేజస్విని,షాలిని, అపర్ణ, సుప్రియ వారి వెంట ఉన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మంగళవారం ఎంపిడిఓ రమేష్ తో కలిసి బోథ్ మండల ప్రత్యేక అధికారి వాజీద్ అలీ ఆహార నాణ్యత తనిఖీ నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి బోజనం చేశారు. ఈ సందర్బంగా వాజీద్ అలీ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం బోజనం అందించాలని పేర్కొన్నారు. అలాగే నాసిరకం కల్తీ పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆహార నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా సిఎం కప్ నిర్వహణ సందర్బంగా మండల వ్యాప్తంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల బోజన వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి రామారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జి.సంగీత, కె.రవి కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయంలో సీఎం కప్ క్రీడాపోటీలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని జవహర్ నవోదయా విద్యాలయం ఆవరణలో మంగళవారం నాడు సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ బిక్షపతి, ఎంపీడీఓ గంగాధర్‌లు ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నవోదయా పాఠశాల ఇంచార్జీ పిన్సిపాల్ మన్మోహనన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ బాగుకోసమే పోచారం పార్టీ మారారు...

**ప్రజాపక్షం/బాన్సువాడ:**బాన్సువాడ నియోజకవర్గంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి బిఆర్ఎస్ అభ్యర్థి అయిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తు తన స్వలాభం, కుటుంబ బాగుకోసం కాంగ్రెస్ పార్టీలోకి పోచారం చేరారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం కాంగ్రెస్‌లో చేరిక ఎవరు జీర్ణించుకోలేకపోతున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సి పోయి తన సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారిన వ్యక్తికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తాను కూడా 2009 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికి వైఎస్ఆర్ కుటుంబానికి అండగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ జుబేర్, నాయకులు మోచి గణేష్, సాయిబాబా, రమేస్ యాదవ్, నర్సాగౌడ్, శివసూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రానికి కుర్చీల వితరణ

**ప్రజాపక్షం /గొల్లపల్లి :** గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రానికి కుర్చీల వితరణ చేసినట్లు అంగన్వాడి టీచర్ కాస హరిత తెలిపారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని తిరుమలాపూర్ (పిడి ) గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రం 3కు గ్రామానికి చెందిన వి కింగ్స్ యూత్ సభ్యులు 20 కుర్చీలు ఒక సీలింగు ఫ్యాన్ బహుకరించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ అంగన్వాడి చంటి పిల్లలకు కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో నేలపై కూర్చొని చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని పిల్లలకు కుర్చీలను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు కుర్చీలు అందజేసిన వీ కింగ్స్ యూత్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గండికోట దేవేందర్, సభ్యులు రమేష్, లక్ష్మ ణ్, దాండ్ల సురేష్, సందీప్, రాకేష్, కనకయ్య,కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు కాస గంగాధర్, రమేష్,అంగన్వాడి టీచర్ హరిత ,ఆయా రమ్యశ్రీ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బాల్య వివాహాలు, నిషేద చట్టాలపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శశికిరణ్మయి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నతనంలో బాలికలకు వివాహాలు చేసినట్లయితే అనారోగ్య సమస్యలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చట్ట విరుద్ధమని తెలియజేవారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసునూటి శ్రీధర్, సిడిఎస్ కవిత, గట్టు శ్రీవాణి, మాధవరపు శారద, సంఘం పట్ల సురేందర్, సుంకె ఉమాదేవి, మల్లిఖార్జున్, సిఆర్‌పిలు సురేందర్, రమేష్‌లు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

### బిజెపి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్




**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ :** రక్తదానం ప్రాణదానంతో సమానమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో మార్వాడి యువమచ్ కాగజ్‌నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో మరొకరి జీవితానికి వెలుగును నింపవచ్చని తెలిపారు. సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. జీవన్‌ధార సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దురదృష్టవశాత్తు, అనారోగ్యం, ప్రణాంతక ప్రమాదాల కారణంగా ప్రతీ రోజు వేలాది మందికి రక్తం అవసరమవుతుందని, రక్త బ్యాంకులు ఎళ్లప్పుడూ అవసరమైన మొత్తాన్ని పూర్తి చేయలేవని అన్నారు. ముఖ్యంగా మహమ్మారి కారణంగా అవసరాలు చాలా రేట్లు పెరిగాయని, మంచి సమారిటన్‌లకు సహాయం అందించి కొన్ని ప్రాణాలను కాపాడాల్సిన బాద్యత ఉందన్ని అన్నారు. రక్తదానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్వాడి యువ మోర్చా అధ్యక్షులు అరుణ్‌లోయ, గిరిధర్ లాల్ ముందడ, సెక్రటరీ అభిషేక్ అసవా, ట్రేజరర్ శుభం లోయ, బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ,ఆర్ఎస్ఎస్‌ప్రముఖ్‌రంగస్వామి శివగౌడ్, మార్వాడి యువ మోర్చా మాజీ అధ్యక్షులు రాజేష్, పాల్గొన్నారు.

## నేటి నుంచి మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలు

### ఎంపిడిఓ దివ్యదర్శనరావు,ఎంఇఓ రాజయ్య



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ దివ్యదర్శనరావు, ఎంఇఓ రాజయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న సిఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు నుండి కబడ్డీ, ఖో ఖో,వాలీ బాల్ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని సిఎం కప్పును విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, సంధ్య, మధుకర్, శ్రీవాణి, వెంకటేష్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లికి అవమానం

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :**కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని అవమానపరిచారని బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రం లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని సిఎం రేవంత్ రెడ్డి కించపరచారని ఆరోపించారు. కేవలం సోనియాగాంధీ మెప్పు కోసమే కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సాంస్కృతిక చిన్నహాలను మార్చే కుట్ర చేస్తుందని రానున్న రోజుల్లో ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ హైమద్, మాజీ జెడ్పిటిసి అజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువరి వెంకటేశ్వర్లు, నాయకులు గంధం శ్రీనివాస్,నిసార్, రాజ్ కుమార్,పాల్గొన్నారు.

## అటవీ శాఖకు ఇస్తున్న భూములను నిలిపివేయాలి

**ప్రజాపక్షం/ కాసిపేట :**కాసిపేట మండలంలోని ఏజెన్సీ గ్రామ పంచాయితీ మద్దిమడ్‌లో ఆదివాసి, గిరిజనులు సాగు చేస్తున్న భూములను ఎలాంటి గ్రామ సభలు, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అటవీ శాఖకు అప్పగించడం తగదని, తక్షణమే వాటిని నిలిపివేయాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మల్లేష్, రాజన్న, బాలరాజులు స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని సర్వే నంబర్ 84లోని 40 సంవత్సరాల నుండి సదరు భూమిని సాగు చేయడం జరుగుతుందని, పిసా గ్రామ సభలు, అనుమతులు లేకుండా అటవీ శాఖకు అప్పచెప్పడం సరికాదని అన్నారు. అటవీ శాఖ భూములను లాక్కోవడంవలన అనేకఅనేక మంది ఆదివాసి ప్రజలు నష్టపోతారని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఏజెన్సీ గ్రామ పంచాయితీల్లోని భూములను ఆదివాసిలకే అప్పగించాలని కోరారు.



## చదువుతో పాటు పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారే విజేతలుగా నిలుస్తారని విశ్రాంత అధ్యాపకులు భుజంగం అన్నారు. మంగళవారం టియులో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి అధ్యక్షతన పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని విశ్వవిద్యాలయ వనరులను వినియోగించుకుని ఉత్తమంగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలో సమయం చాలా ముఖ్యమైనదని, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారే విజేతలుగా నిలబడ్డారన్నారు. సహజంగా ప్రతి విద్యార్థికి తెలివితేటలు ఉంటాయన్నారు. తెలివితేటలను బాధ్యతగా ఉపయోగించుకున్న వారే జీవితంలో స్థిరపడుతారన్నారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్, ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేత

**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండిలోని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్టు ఏర్పాటుకు చొప్పదండి పట్టణానికి చెందిన బీమనాతిని సరస్వతి వెంకటనర్సయ్య వారి కుమారుడు బీమనాతిని రాజు, కుటుంబ సభ్యులు రూ.18,018 లు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేస్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండె సత్యానందం, ఉపాధ్యక్షుడు మునిగాల సుధాకర్, ఐట్ల మల్లేశం, అయ్యప్ప భక్తులు పాల్గొని విరాళం అందజేసిన వారి కుటుంబ సభ్యులకు అయ్యప్ప స్వామి కృపా కటాక్షములు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.

## విద్యార్థులకు గణిత ప్రతిభ పోటీలు

**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణిత ప్రతిభ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను తెలంగాణ గణిత ఫోరం ఆద్వర్యంలో నిర్వహించారు. మొత్తం 27 మంది విద్యార్థులు ప్రతిభా పరీక్ష రాశారు. వీరిలో విజేతలను ప్రకటించారు. చొప్పదండి పట్టణానికి చెందిన హిమవాణి ట్రేడింగ్ కంపెనీ యజమాని పాత శ్రీనివాస్ విద్యార్థులకు తన సొంత ఖర్చులతో బహుమతులను అందజేశారు. వీటిని మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం అద్యక్షుడు కాసుగంటి రాజమౌళి తదితరులున్నారు.

## మండల వ్యవసాయధికారికి సన్మానం

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :**మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గణపురం సంతోష్ ఆధ్వర్యంలో నూతనంగా మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మిరియాల మనీషాను మండల మహిళా సంఘం సభ్యులు మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అని రంగాల్లో ముందుండాలని, ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మనీషాను స్ఫూర్తి పొంది ఆర్యవైశ్యులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల ప్రధాన కార్యదర్శి రావుల కృష్ణ, కోశాధికారి చిలువేరు భాస్కర్, సభ్యులు రాచకొండ రమేష్, నరేందర్, కృష్ణ, రాజు, రామన్న, నాగేష్, హరికృష్ణ, వెంకటేష్, వెంకన్న వినోద్ రాజకుమార్ సత్యనారాయణ సందీప్ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్

**ప్రజాపక్షం/చొప్పదండి:**క్రీడాకారులను అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం చొప్పదండి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సిఎం కప్ పోటీలను యువకుల్లో శారీరక మానసిక ఉల్లాసాన్ని, క్రీడా స్ఫూర్తి పెరుగుతుందన్నారు. చొప్పదండి మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు మాట్లాడుతూ మండలాన్ని రాష్ట్రస్థాయిలో నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు పెరమాండ్ల మానస గంగయ్య గౌడ్, కొట్టె అశోక్, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి వేణుగోపాల రావు, ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు, ఎస్సై జి.అనూష, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులుఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరాటేలో విద్యార్థినిల ప్రతిభ

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినిలు కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. కాగజ్ నగర్ లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సైదం శైలజ, అక్షయ, మేఘనలు గోల్డ్ మెడల్ సాధించగా అంజలి, తేజ రాణి, రచన శ్రీ, ప్రశంస, నందిని, అభినయ, సిల్వర్ పథకాలను సాధించారు. కరాటే క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను పాఠశాల ప్రిన్సిపాల్ రత్న బాయ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో కరాటే రంగంలో అద్భుతంగా రాణించి జాతీయస్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## సింగరేణి ఒసిపి-5లో రక్షణ పక్షోత్సవాలు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనిలోని సింగరేణి ఆర్జీ1 ఏరియా ఒసిపి5లో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రొగ్రాం కన్వీనర్(కార్పొరేట్), జీఎం(ఆర్అండ్‌డి) నారాయణరావు, ఆర్జీ1 జీఎం లలిత్‌కుమార్, జీఎం(సేఫ్టీ) గుప్తాలు రక్షణ జెండాను ఎగురవేశారు. ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పని స్థలాలు, విభాగాలు, దారులు, వాహనాలను సందర్శించి ఏవిధంగా రక్షణ చర్యలు చేపట్టాలో అధికారులు వివరించారు. రక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవో చంద్రశేఖర్, సేఫ్టీ ఆఫీసర్ పొనగోటి శ్రీనివాస్, మేనేజర్ రమేష్‌బాబు, ఎఐటీయూసీ నాయకులు అరెల్లి పోషం, స్వామి, ప్రభుదాస్, అధికారులు రమేష్, సునీల్‌వర్మ, కార్పొరేట్ అధికారులు రామకృష్ణ, లక్ష్మిరాజు, సంక్షేమాధికారి ఫిరోజ్ ఖాన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** విధ్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ సందనవేన సునీత రాజేందర్ యాదవ్ తెలిపారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విధ్యార్థులకు మంగళవారం స్పోర్ట్స్ డ్రెస్సులు రాజేందర్ యాదవ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యార్థులు, గ్రామస్థులు రాజేందర్ ను అభినందించారు. అనంతరం రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. విధ్యార్థులకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం పురుషోత్తం, వ్యాయామ ఉపాధ్యాయులు రామేశ్వర్, విజయ రాణి, అశోక్, కనకయ్య,జ్యోతి, శ్రీదేవి, సంతోషి పాల్గొన్నారు.

## పోషకులు విద్యార్థులపై శ్రద్ధ వహించాలి




**ప్రజాపక్షం/గోదావరిఖని :** విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా ప్రయత్నిస్తున్నామని, తల్లిదండ్రులు, పోషకులు విద్యార్థులపై శ్రద్ధ వహించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన అన్నారు. మంగళవారం గోదావరిఖని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోషకులతో సమావేశం నిర్వహించారు. క్రమం తప్పకుండా విద్యార్థినిలు కశాళాలకు హజరయ్యేలా చూడాలన్నారు. తరగతులు వినడం, పునశ్చరణల ద్వారా చదువులో ముందంజలో ఉంటారన్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున స్టడీ అవర్, యోగాకు ప్రత్యేక సమయాన్ని కేటాయించినట్లు విద్యార్థినిలు రాకుంటే ఇవన్నీ కోల్పోతారన్నారు. నిత్యం చదివించడంతోపాటు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్, రమేష్, ధనలక్ష్మి, సంపత్‌లు పాల్గొన్నారు.

## శాతవాహన జెఎసి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/కరీంనగర్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కెటిఆర్ పిలుపు మేరకు శాతవాహన జేఏసి వ్యవస్థాపక చైర్మన్, బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకుడు చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో మంగళవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న నాలుగు కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. తల్లి లాంటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చినటువంటి నయవంచక రజాకార్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తల్లిలాగా భావించే తెలంగాణ తల్లి విగ్రహాన్ని తొలగించడం పట్ల యావత్ తెలంగాణ ప్రజలు దిగ్భ్రాంతులకు గురవుతున్నారని, విగ్రహాన్ని మార్చడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. విగ్రహాన్ని పాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి కొత్త విగ్రహాన్ని పెట్టాలనుకునే కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను మానుకోవాలని, లేకపోతే రానున్న రోజుల్లో తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడడానికి ఏ ఉద్యమం చేయడానికైనా బిఆర్ఎస్‌వి రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేయడానికి ముందుకు వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టే విగ్రహాన్ని రాష్ట్రంలో ఎక్కడా ఏర్పాటు చేయనీయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చెందబోయిన సాయిరెడ్డి, నైతం మహేష్, నైతం సాయికృష్ణ, శివ పవన్, ఉమర్, అనూప్ రెడ్డి, రాకేష్, ప్రేమ్ కుమార్, తదితరులున్నారు.

## ఐడియా అదిరింది.. పిల్లలకు సంతోషం పంచింది

### వినూత్నంగా ఆలోచన, మెప్పించిన ' తక్ష్'యాజమాన్యం
### మెరుగైన వైద్యం కోసం తక్ష్ సపర్ స్పెషాలిటీ హాస్పిటల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఐడియా అదిరింది. సంతోషంపంచింది. నిజమే ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది. ఎంతో మార్పును తీసుకవస్తుంది. అవును అలాంటిదే ఈ ఆలోచన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తక్ష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ముఖేష్ వైద్యులుగా ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తూ పేరు గాంచారు. మార్కెట్‌కు దగ్గరలో హాస్పిటల్‌లో సేవలందించటంతో పాటు ఎందరికో సులువుగా వ్యాధులను నయం చేస్తూ ప్రశంసలు పొందారు. హాస్పిటల్‌లో దినదినాభివృద్ధి చెందటంతో రోగుల సంఖ్య మరింత పెరిగింది. సేవలను మరింత పెంచాలని, సేవలందించాని ఉద్దేశ్యంతో, మారుతున్న కాలానికనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని నిజామాబాద్ నడిఒడ్డున వినాయక్‌నగర్‌లోని మున్నూరుకాపు కళ్యాణ మండపం రోడ్డులో యెండల టవర్స్ ముంద విశాలమైన స్థలంలో తక్ష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించారు. హాస్పిటల్ వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దని ఉద్దేశ్యంతో ప్రస్తుత పరిస్థితులను గమనించి అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా హాస్పిటల్‌కు వచ్చే గర్భిణి స్త్రీలను, వారి చిన్నారులను దృష్టిలో ఉంచుకుని హాల్‌లో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆటబొమ్మలు ఉండటంతో వైద్యుని వద్దకు వెళ్లే సమయంలో పిల్లలు మొరం చేయకుండా ఆడుకోవడానికి ఎంతో దోహదపడుతున్నాయి. వైద్యం కోసం వచ్చిన వారి కోసం ఆహ్లాదకరమైన హాల్, సోపాలు ఏర్పాటు చేశారు. ఇదివరకే హాస్పిటల్‌కు వచ్చే రోగుల సంఖ్య ఎక్కువే. ఈ సౌకర్యాలతో మరింత పెరిగిందని అక్కడికి వచ్చే రోగులు చెబుతున్నారు. జనవరి 22న హాస్పిటల్‌ను జిల్లా ప్రముఖులు చేతుల మీదుగా ప్రారంభించనున్నామన్నారు. మా హాస్పిటల్‌లో మెరుగైన వైద్యమందించనున్నామన్నారు.

## రైతులు పాడి పెంపకంపై దృష్టి సారించాలి: డాక్టర్ కళ్యాణి

**ప్రజాపక్షం/ముత్తారం :** రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపక పై దృష్టి సారించాలని డాక్టర్ కళ్యాణి, డాక్టర్ అర్చన, (కృషి విజ్ఞాన కేంద్రం) రేఖారాణి విఎ సూచించారు. పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలో కరీంనగర్ పశుగణాభివృద్ధి సంస్థ సూపర్వైజర్ రాఘవ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణం ద్వారా జన్మించిన దూడల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉచిత పశువైద్య శిబిరం సందర్భంగా పాడి రైతులకు దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. నట్టలనివారణ మందులను, మినరల్ మిక్చర్ పౌడర్ ను అందించారు. గోపాలమిత్ర ద్వారా పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు జన్మించే వీర్యం అందుబాటులోకి వచ్చిందిన్నారు. దీని విలువ 600 రూపాయలు ఉంటుందని ప్రభుత్వ రాయితీపై రైతులకు 250 రూపాయలకే అందిస్తున్నామని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గర్భకోశ వ్యాధి చికిత్సలు 46, కృత్రిమ గర్భధారణ 2, దూడల నట్ట నివారణ మందులు 46, తాగించారు.సాదరణ చికిత్స లు60 ,ఈ కార్యక్రమంలో గోపాలమిత్రులు పశు సంవర్ధక శాఖ సిబ్బంది.పాడి రైతులతోపాటుపాల్గొన్నారు.

## కోల్ ఇండియా స్థాయిలో రాణించి సింగరేణి సంస్థ పేరును నిలబెట్టాలి

**ప్రజాపక్షం/రామగిరి :** కోల్ ఇండియా స్థాయిలో రాణించి సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి అథ్లెటిక్స్ , స్విమ్మింగ్, త్రో బాల్ పోటీలను మంగళవారం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావుముఖ్య అతిథిగా పాల్గొని, పతాకావిష్కరణ గావించి ప్రారంభించారు. ఈ పోటీల్లో 6 బెల్లంపల్లిమందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం 1&2, రామగుండం 3 భూపాలపల్లి,మణుగూరుఇల్లందు, కార్పోరేట్‌కొత్తగూడెం రీజియన్ల నుండి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఉద్యోగుల క్రీడల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి క్రీడా కారుడు నైపుణ్యాన్ని పెంచుకొని రాణించాలని అన్నారు. కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించి సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని అన్నారు.అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో విజేతలకు వారితో పాటు మరొక ముఖ్య అతిథిగా హాజరైన అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు పతకాలను అందజేశారు.కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్. వెంకటరమణ, ఎస్వోటుజియం లు జి.రఘుపతి, బండి నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి వి. సునీల్ ప్రసాద్ , అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్ వెస్లి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసింహ రెడ్డి,ఇతర అధికారులు, స్పోర్ట్స్ సూపర్వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## ఆశా వర్కర్ల అరెస్ట్ హేయమైన చర్య

**ప్రజాపక్షం/బోధన్:** ఆశా వర్కర్ల సమస్యలపై చలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశ వర్కర్లను అరెస్టు చేయడం ప్రభుత్వ హేయమైన చర్య అని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశ వర్కర్లు తమ వేతనాలు పెరుగుదల కోసం ఉద్యోగ భద్రత కోసం హైదరాబాద్ నగరంలో జరిగే ధర్నాకు వెళ్తున్న ఆశాలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి బోధన్ స్టేషన్‌కు తరలించారని అన్నారు. గత ప్రభుత్వం లాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమాలను అణిచి వేయడం ఏ విధంగా ప్రజా పరిపాలన అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పోరాటాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు విజయలక్ష్మి , సుజాత, కల్పన, జ్యోతి, రమణి, రమ, పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐపిఎస్ పాఠశాల విద్యార్థులు

**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** టాటా కంపెనీ వారు నిర్వహించిన టాటా బిల్డింగ్ ఇండియా స్కూల్ ఎస్సే కాంపిటీషన్ వ్యాచరచన పోటీల్లో స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలప్రత్యేక ప్రతిభా కనబరిచారు.పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు శ్రీ నిత్య, రిషి వరుణ్, అన్విత, ప్రీతం రావు, విషిత శ్రీ, సాహిత్య అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి, రెండో బహుమతి అందుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలాభిషేకంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**ప్రజా పక్షం /రామగిరి :** హైదరాబాదులోని బిఆర్ఎస్ భవన్ లో మంగళ వారం తెలంగాణ తల్లి కి పాలాభిషేకం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ నిర్వహించారు. ఈ పాలాభిషేకం కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, కమాన్ పూర్ మండల బిఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ ,మాజీ వైస్ ఎంపీపీలు కొట్టే భూమయ్య ,ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, నీలం శ్రీనివాస్ మచ్చ గట్టయ్య, పెళ్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మేక మృతి

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన మేడోకొండ మహేష్ కు చెందిన మేక మంగళవారం విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. మేకలను మేడిపల్లి శివారులోని కనవేన. సదానందం పొలం వద్ద మేపుతుండగా, అక్కడే ఉన్న ట్రాన్స్ఫార్మర్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో మేక అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ. 20 వేలు ఉంటుందని యజమాని మహేష్ తెలిపారు. విద్యుత్ ఏ.ఈ కోరండ్ల మహేందర్ రెడ్డి ఆదేశాలతో లైన్ మెన్ బండారి శివ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## వన్నెల్ శివారులో చెట్ల నరికివేత చర్యలు ఏమి లేవా...



**ప్రజాపక్షం /నందిపేట్ :** ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తు హరితహారం పేరుతో మొక్కలు నాటిస్తుంది. అవి పెరిగి పెద్దయితే పొలాలకు అడ్డువస్తున్నాయని రైతులు నరికివేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. నందిపేట్ మండలంలోని వన్నెల్ గ్రామ శివారులో రోడ్లుభవనాల శాఖ పరిధి లో ఉన్న రోడ్డు వెంట చెట్లు మచ్చర్ల గ్రామానికి చెందిన రైతు నరికి వేశాడు. ఏపుగా పెరిగి నీడను ఇచ్చే చెట్లను నరికివేసి తాను అధికార పార్టీ నాయకుడిని, నన్ను మీరు ఏమి చేయలేరని గ్రామ పంచాయతీసిబ్బందికిఎదురుతిరిగాడు.అయినాఅధికారులు అటవీశాఖ వారు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ఈ విషయంలో కలెక్టర్ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ నగర అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనికి చెందిన కాంగ్రెస్ పార్టీ రామగుండం నగర శాఖ అధ్యక్షుడు బొంతల రాజేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళ వారం రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆసుపత్రికి వెళ్లి రాజేష్‌ను పరామర్శించారు. మనోధైర్యం చెప్పారు. వైద్యులను చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలన్నారు. వెంట కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు గౌస్‌బాబా ఉన్నారు.

## కళాశాలను తనిఖీ చేసిన ఇంటర్ విద్యాధికారి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట** :మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను రాజన్నసిరిసిల్లా ఇంటర్ విద్యాధికారి వై శ్రీనివాస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు,మంగళవారం అధ్యాపకులతో మాట్లాడారు,విద్యార్థులకు సరియగు సౌకర్యాలు ఉన్నాయో లేదో తెలుసుకున్నారు.వార్షిక పరీక్షలు దగ్గరలో ఉండటంతో సైన్స్ విద్యార్థులకు లేబరోటరి తరగతులు,ప్రయోగాలు చేయించాలన్నారు .కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ వాసరవేణి పర్శరాములు,క్యాతంలక్ష్మి నారాయణ,భూమక్క,ప్రసాద్ ,గౌతమి,గీత,సాగర్‌ఉన్నా రు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో విషాదం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విషాదకరమైన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగర శివారులోని నాగారం ప్రాంతానికి చెందిన చాట్ల లక్ష్మ ణ్(50) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ నాలుగు రోజుల క్రితం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. మంగళవారం ఉదయం భవనంపై అంతస్తు నుంచి దూకటంతో గాయాలతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఆస్పత్రి సిబ్బంది 1వ టౌన్ పోలీసులకు సమాచారమందించారు. వెంటనే 1వ టౌన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మ ణ్ ఇక తనకు వ్యాధి నయం కాదన్న ఆవేదనతో ఈ దుర్ఘటనకు పాల్పడినట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని చికిత్స నిమిత్తం భుత్వ ఆస్పత్రిలోని మార్చురికి తరలించారు. ఈ సంఘటనతో మృతుని బంధువులుకన్నీరుమున్నీరుగావిలపించా రు.

## తహసీల్దార్‌ను సన్మానించిన మాజీ సర్పంచులు

**ప్రజాపక్షం/అంతర్గాం:** అంతర్గాం మండల నూతన తహసీల్దారు తూము రవీందర్‌ను బ్రహ్మణపల్లి, గోయల్‌వాడ, ఆకెనపల్లి, సోమనపల్లి గ్రామాల మాజీ సర్పంచులు బండారి ప్రవీణ్‌కుమార్, ధర్ని రాజేష్, మెరుగు పోచం, కొల్లూరి సత్యసతీష్‌లు మంగళవారం శాలువాతో సన్మానించారు. తహసీల్దారుకు స్వాగతం పలుకుతూ, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు

# కోనరావుపేటలో ఎఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

**ప్రజాపక్షం / కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యవసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాగా కష్టపడి చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్నవంటి అనేక సమస్యలపై ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల అనేక ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని సంక్షేమ హాస్టల్‌లో గురుకుల హాస్టల్ సందర్శించి వారి సమస్యలు తెలుసుకుంటున్నామని అందులో భాగమే కోనరావుపేట ట్రైబల్ హాస్టల్‌లో సందర్శించి అనంతరం ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, అదే విధంగా పెరిగిన ధరలకు




అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విద్యాభ్యసన కొరకు మండలంలో ఉన్న వివిధ గ్రామాల నుండి విద్యార్థులు రావడం జరుగుతుంది. బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థిని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వచ్చిన బస్సులలోనే ఓవర్ లోడ్ అయ్యే విధంగా విద్యార్థులను ఎక్కించుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎఐఎస్ఎఫ్ నాయకులు జశ్వంత్, ఈశ్వర్, చేతన్, విష్ణు, చరణ్ పాల్గొన్నారు.

# క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సిఎం కప్ పోటీలు

### జిల్లా శిక్షణ కలెక్టర్ అబిజ్ఞాన్ మాలవీయ.

**ప్రజాపక్షం/తలమడుగు :**సిఎం కప్ మండల స్థాయి క్రీడలను మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జిల్లా శిక్షణ కలెక్టర్ మాలవీయ మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులు అతిథులు కలిసి వందేమాతర గీతాన్ని ఆలపించారు.క్రీడాకారులతో శిక్షణ కలెక్టర్ పరిచయం చేసుకొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థుల క్రీడల నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ సిఎం కప్పు పేరుతో గ్రామపంచాయతీ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.విద్యార్థులు చదువుతోపాటు క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి



క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు,జిల్లా క్రీడా అధికారి పార్థసారథి,మండల ప్రత్యేక అధికారి గజానన్ తాహాసిల్దార్ రాజమోహన్,ఎంపీడీవో శేఖర్,మండల విద్యాధికారి వెంకట్రావు,ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష్,మాజీ జెడ్పిటిసి గణేష్ రెడ్డి,కేదారేశ్వర్ రెడ్డి, దామోదర్ రెడ్డి,మౌనిష్ రెడ్డి,పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు,బాల కార్మికులపై అవగాహన

**ప్రజాపక్షం/లోకేశ్వరం :**విజన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలో మంగళ వారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు బాల్య విహహాలు,బాలకార్మికుల గురించి అవగాహనా కల్పించారు.ఈ సందర్భంగా కమిటీ మొబిలైజర్ అనురాధ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఏర్పడే సమస్యల గురించి అలాగే బాల కార్మికుల చట్టాల గురించి విద్యార్థులకు వివరించి వీటిని నిర్మూలించడంలో అందరూ భాగస్వాములు కావాలని,బాధ్యతగా గ్రామంలోగాని,మీ పరిసర ప్రాంతాలలో గాని బాలకర్మిలు ఉన్నట్లు మీకు తెలిసినా,బాల్య వివాహాలు గ్రామాలలో జరిగినా లేదా పరిసర ప్రాంతాలలో జరిగినా 100 లేదా 1098 కాల్ చేసి బాల్య వివాహాలు లేని గ్రామం గా తీర్చి దిద్దవలసిన బాధ్యత మన అందరి పైన ఉంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్‌గంగాభూషణ్,పాఠశాలప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్‌జివన్ లో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మంగళవారం రోజున ఆర్.జి.వన్ ఏరియా జిడికె 11 ఇంక్లెన్ నందు "మల్టి డిపార్ట్ మెంటల్" సమావేశం డి. లలిత్ కుమార్ జనరల్ మేనేజర్ ఆర్.జి.వన్ ఆధ్వర్యంలో మన సంస్థ,మన గని,మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్ట్మెంట్ సమావేశం మొదటి మరియు రెండవ బదిలీలలో నిర్వహించడం జరిగినది.మన సంస్థ, మన గని, మన బాధ్యతలను వివరించే ఇట్టి "మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశంలో వివిధ అంశాల గురించి కమిటి సభ్యులు తెలియజెస్తూ సింగరేణి సంస్థ (చైర్మెన్&మేనేజింగ్ డైరెక్టర్) ఎన్.బలరామ్ ఐఆర్ఎస్ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని గనుల పై "మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశం" నిర్వహించుకోవటం జరుగుతుందని ఇందులో భాగంగా సంస్థ పురోభివృద్ధికి సాధించవలసిన అంశాల గురించి తెలియజేస్తూ మన సంస్థ, మన గని, మన భాధ్యతలను వివరించే ఇట్టి మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశం నిర్వహిచడం ద్వార తమ వంతుగా ప్రతి ఒక్కరు వివిధ సలహాలు ఇవ్వడం ద్వారా. సంస్థపై అంకితభావం, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పదకతలు పెంచుటకు సంస్థను ముందుకు తిసుకుపోదాం అనే నినాదంతో కంపెని వ్యాప్తంగా ఇట్టి సమావేశాలను నిర్వహించుకోవటం జరుగుతుందని అన్నారు.మల్టి డిపార్ట్మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశా



లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి లోని గనులు వాటి పని తీరు గురించి వివరించడం జరిగినది. ఉత్పత్తి ఉత్పాదకత, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తరలింపు, నెలల వారిగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాదించుటకు ప్రణాళికల గురించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్.జివన్ ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి పెంపునకు తీసుకోవలసిన ప్రణాళికల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జియం గోపాల్ సింగ్, ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, ఏరియా ఇంజనీర్ డి.వి రావు, ఐఇడి ఎజియం ఆంజనేయులు, ఏజంట్ చిలుక శ్రీనివాస్, డిజీయం పర్సనల్ కిరణ్ బాబు, ఫైనాన్స్ డిజియం ధనలక్ష్మి భాయి, మేనేజర్ కోలా మల్లేశం, కమిటి సభ్యులు రాజన్న, నాయిని శంకర్, మహేష్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాం పరిశీలన : కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు.షిఫ్టుల వారీగా భద్రతను పర్యవేక్షించాలని,సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి డి.శివాజీ,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్ రెడ్డి,సిరికొండ రమేష్,గాజుల రవి,నరేష్,మజార్,భద్రతా సిబ్బంది,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెంచాలని వినతి

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి / తంగళ్లపల్లి :** జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్‌కృష్ణయ్య ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు పెంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు బిసి సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిది కోరుట్ల రమేష్, జిల్లా కార్యదర్శి సిలువేని మల్లేశం, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జీఅరుణ్ తేజా చారి, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సంబు ఎలేందర్, తంగళ్లపల్లి మండల అధ్యక్షులు ఎగుర్ల కరుణాకర్, బోయినిపల్లి మండల అధ్యక్షులు పెంచల మహేష్ పటేల్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు పెద్దోళ్ల బాలయ్య, రుద్రంగి మండల అధ్యక్షులు మీసాల మల్లేష్ పటేల్, గంభీరావుపేట మండల అధ్యక్షులు కాల్వ ప్రసాద్, సామల రమేష్, కాసర్ల అరుణ్, మొగులోజి నర్సయ్య, తదితర బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సమస్యలపై ... 12న చలో హైదరాబాద్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న చలో హైదరాబాదులకు అనుమతి ఇవ్వాలని నిర్మల్ జిల్లా ఐసిడిఎస్ ఏపీడికి వినతిపత్రం అందజేశారు.అనంతరం బొమ్మెన.సురేష్ సిఐటియు నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్రమంకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.అసెంబ్లీ శీతాకాలం సమావేశాల సందర్భంగా అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్ కు గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు,ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మేఏనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బి.లలిత అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి,శైలజ అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపిలకు తక్షణమే శిక్షణ ప్రారంభించాలి:మోహన్

**ప్రజాపక్షం/బైంసా :**గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ప్రథమ చికిత్సలను అందిస్తున్న ఆర్.ఎం.పి. పిఎంపి వైద్యులకు తక్షణమే శిక్షణ అందించాలని బైంసా డివిజన్ ఆర్‌ఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు.మంగళవారం బైంసా మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్‌ఎంపిలకు శిక్షణను ఇచ్చి ఉపాధి కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.ఏడాది కాలం గడుసున్నప్పటికీ ఆర్‌ఎంపీల శిక్షణ విషయమై ఉల్కు పలుకు లేకుండా ప్రభుత్వం ఉండిపోవడం భావ్యం కాదని తెలిపారు.శిక్షణను ఇవ్వకపోవడానికి తోడు తనిఖీల పేరుతో ఆర్‌ఎంపిల ప్రథమ చికిత్స కేంద్రాలపై కేసులు నమోదు చేయడం బాధాకరమైన విషయం అని అన్నారు.తెలంగాణ సాధన ఉద్యమంలో ఆర్‌ఎంపిలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు.ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆర్‌ఎంపీల శిక్షణ అన్న విషయమై చర్చించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్,బైంసా మండల అధ్యక్షుడు అర్జున్,ఉపాధ్యక్షులు సునీల్,సాయికుమార్,కోశాధికారి తుకారం,తదితరులు పాల్గొన్నారు.

